బడిని బతికించండి

- తరగతి గది మూలాన్ని నాశనం చేయొద్దు
- విద్యావ్యవస్థను తక్షణం గాడిలో పెట్టండి
- గురుకులాలను అపఖ్యాతిపాలుచేయొద్దు
- సంక్షోభ హాస్టళ్లుగా మారిన సంక్షేమ హాస్టళ్లు
- సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): దేశ భవిష్యత్ తరగతి గది లోనే నిర్మితం అవుతుందన్న మాటలకు కేసీఆర్ అక్షర రూపం ఇస్తే, రేవంత్‌రెడ్డి మాత్రం వెన్నెముకనే విరిచేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. విద్యావ్యవస్థను కేసీఆర్ బలోపేతం చేస్తే, రేవంత్‌రెడ్డి బలహీనం చేస్తున్నారని మండి పడ్డారు. రేవంత్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ పతనావస్థకు చేరుకున్నదని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన సోమ వారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహి రంగ లేఖ రాశారు. నేడు రాష్ట్రంలో పురు గులు లేని భోజనం కోసం, పాముకాట్లు, ఎలుక కాట్లు లేని వసతి కోసం, కనీస సౌకర్యాల కల్పన కోసం తరగతి గదుల్లో ఉండాల్సిన విద్యార్థులు రోడ్లెక్కి నిరసనలు తెలియజేస్తున్న దయనీయ పరిస్థితి నెలకొ న్నదని విమర్శించారు. ఒకవైపు టీచర్లు లేని కారణంగా బడులు మూతబడుతుం టే, మరోవైపు ప్రభుత్వ బడుల మీద విశ్వా సం సన్నగిల్లడంతో డ్రాపౌట్స్ పెరిగిపోతు న్నాయని ఉదహరించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే ఈ విద్యా సంవత్సరం లో ఒక్క విద్యార్థి కూడా లేని పాఠశాలలు 1,864 ఉంటే, 30లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలు 9,447 ఉన్నాయని, వందలోపు విద్యార్థులు మాత్రమే ఉన్న పాఠశాలలు 9,609 ఉన్నాయని వివరిం చారు. రేవంత్‌రెడ్డి పాలనలో మొత్తం 26,287 పాఠశాలలకుగాను దాదాపు 20 వేల పాఠశాలల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని దుయ్యబట్టారు.

గురుకులాలను అపఖ్యాతిపాలు చేయొద్దు

ప్రభుత్వ పాఠశాలల స్థితి రోజురోజుకు దిగజారుతుంటే, గురుకులాల పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారిందని హరీశ్ రావు విమర్శించారు. కేసీఆర్ పాలనలో ఎవరెస్ట్ శిఖరమంత ఖ్యాతి గడించిన గురుకులాలు, రేవంత్‌రెడ్డి పాలనలో సమ స్యలకు నిలయాలుగా మారాయని పేర్కొ న్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేం డ్లలో పటిష్టపరిచిన గురుకులాలను కాం గ్రెస్ ప్రభుత్వం తొమ్మిది నెలల్లోనే ధ్వం సం చేసిందని ఆరోపించారు. సంక్షేమ హాస్టళ్లను సంక్షోభ హాస్టళ్లుగా మార్చిన ఘ నత రేవంత్ సర్కార్‌కే దక్కిందని ఎద్దేవా చేశారు. పాఠశాల నుంచి కళాశాల వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఏ హాస్టల్ చూసి నా దుర్భర పరిస్థితులే దర్శనమిస్తున్నా యని వివరించారు. ఈ విద్యా సంవత్స రంలో ఇప్పటివరకు 715 మందికిపైగా వి ద్యార్థులు దవాఖానల పాలు కాగా, 40 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని, ఇది అత్యంత బాధాకరమని, అయినా ప్ర భుత్వానికి పట్టింపు లేదని విమర్శించారు.

వీటిపై తక్షణం దృష్టిపెట్టండి

హరీశ్‌రావు పేర్కొన్న సమస్యలు ఇవి..

- ఈ విద్యా సంవత్సరంలోనే దాదాపు 1,900 పాఠశాలలు మూతపడ్డాయి. వాటిని తిరిగి ప్రారంభించాలి.
- ఖాళీల్లో విద్యావాలంటీర్లను నియమిం చి విద్యా బోధన జరిగేలా చూడాలి.
- పాఠశాలల్లో పారిశుద్ధ్యం లోపించింది. తాగునీటి వసతి లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించాలి.
- సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీంను పునః ప్రారం భించి, డ్రాపౌట్స్ తగ్గేలా చూడాలి.
- పెండింగ్ లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులు వెంటనే విడుదలచేయాలి.
- ఔట్ సోర్సింగ్ టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగుల జీతాలు వెంటనే చెల్లించాలి.
- వసతి గృహాల అద్దెలు చెల్లించాలి. సొంత భవనాలు ఏర్పాటు చేయాలి.
- ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు విద్యా ర్థులకు రావాల్సిన రూ.62 (కాస్మోటిక్ రూ.50, హెయిర్ కటింగ్ రూ.12) ఇప్పటివరకు అందలేదు.
- కాలేజీ హాస్టల్ విద్యార్థులకు ప్రతి నెలా అందాల్సిన రూ.500 పాకెట్ మనీ వెంటనే చెల్లించాలి.
- పెండింగ్ డైట్‌చార్జీలను చెల్లించాలి. డైట్‌చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు మార్కె ట్ రేటుకు అనుగుణంగా పెంచాలి.
- ఎస్సీ గురుకుల విద్యార్థులకు నాలుగు జతల యూనిఫామ్స్ అందించాలి.
- వసతి గృహాల కిటికీలకు జాలీలు, సో లార్ పలకల గీజర్లు ఏర్పాటుచేయాలి.
- వసతి గృహాల నిర్వహణకు ప్రతినెలా ఇచ్చే రూ.10 వేలు వెంటనే ఇవ్వాలి.
- బీసీ వసతి గృహాలకు బెడ్‌షీట్స్, కార్పెట్స్, స్కూల్‌బ్యాగ్స్, స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు, రగ్గులు, రెండు రకాల బూట్లు ఇప్పటివరకు అందించలేదు. వెంటనే అందించాలి.

నాటి బలిదేవత.. నేడు తెలంగాణ తల్లి

- గాంధీ కుటుంబంపై రేవంత్ ప్రశంసలు
- అతి ప్రేమ ఒలకబోతపై సర్వత్రా విస్మయం
- నాడు సోనియాను బలిదేవతన్న రేవంత్
- రాహుల్‌గాంధీ పప్పు అంటూ విమర్శలు
- అమరుల త్యాగాన్ని కించపరిచిన రేవంత్
- అధికారిక సభలో ఫక్తు రాజకీయ ప్రసంగం



హైదరాబాద్, సెప్టెంబర్ 16(నమస్తే తెలం గాణ): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహావి ష్కరణ సందర్భంగా గాంధీల కుటుంబంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒలకబోసిన ప్రేమ ను చూసి కాంగ్రెస్‌వాదులు ముక్కున వేలేసు కుంటున్నారు. నిన్న మొన్న పార్టీలో చేరిన ఆయన పుట్టు కాంగ్రెస్‌వాదిగా నీతులు చెప్పుం టే ఏం మాట్లాడాలో తెలియక సైలెంట్ అయి పోయారు. రేవంత్‌రెడ్డి అతి వినయంపై పార్టీ లో జోరుగా చర్చ జరుగుతున్నది. అదే సమ యంలో అధికారిక కార్యక్రమంలో రాజకీయ ప్రసంగం చేస్తూ తిట్ల దండకం ఎత్తుకోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నాడు సోనియాగాంధీని బలిదేవత అని, రాహుల్ గాంధీని పప్పు అంటూ కించపరిచిన రేవంత్ రెడ్డి ఇప్పుడు వాళ్లను పొగుడుతుంటే ఆశ్చర్య పోయి చూస్తున్నారు. నాటి బలిదేవత నేడు తెలంగాణ తల్లి అయిందా అని ప్రశ్నిస్తున్నారు. వారి కుటుంబ చరిత్ర చెప్పడంపైనా ఆశ్చర్య పోతున్నారు. కొత్త భక్తుడు ఒళ్లంతా బొ ట్లు పెట్టుకు న్నట్టు ఆరేండ్ల క్రి తం కాం గ్రెస్‌లో చేరిన ఆయ న, పుట్టు కాంగ్రెస్ వాదులకన్నా ఎక్కువగా కాంగ్రెస్ పార్టీ, గాంధీల కుటుంబం గురించి చెప్పడంపై ముక్కున వేలేసుకుంటున్నారు.

అమరుల త్యాగాలు కనిపించలేదా?

కాంగ్రెస్ పార్టీ వల్లే, సోనియాగాంధీ వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని రేవంత్‌రెడ్డి పేర్కొనడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్త మవుతున్నాయి. రేవంత్‌రెడ్డికి అమరుల త్యా గాలు గుర్తుకు రావడం లేదా? అని ప్రశ్నిస్తు న్నారు. సోనియాగాంధీ వల్లే తెలంగాణ వస్తే వందలమంది విద్యార్థులు ఎందుకు బలయ్యా రని నిలదీస్తున్నారు. తెలంగాణ ప్రజలు, అమరుల త్యాగాలను పక్కన పెట్టి కేవలం సోనియాగాంధీ వల్లే తెలం గాణ వచ్చిందంటూ సీఎం చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ ప్రజలు మండిపడుతున్నారు.

పీవీని అవమానించింది కాంగ్రెస్ కాదా?

తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారా వు ను ప్రధానమంత్రిని చేసింది సోని యాగాంధీ కాదా అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అదే పీవీని ఇదే సోనియాగాంధీ, ఇదే కాంగ్రెస్ పార్టీ అవమానించిన విషయం సీఎం రేవంత్‌రెడ్డికి తెలియదా? అని గుర్తుచే స్తున్నారు. పార్టీని కష్టకాలంలో ఆదుకొని, దేశా న్ని నడిపించిన పీవీ మరణం తర్వాత కనీసం ఆయన మృతదేహాన్ని ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆఫీసులోకి కూడా తీసుకురానివ్వకుండా అ డ్డుకున్నది నిజం కాదా? అని నిలదీస్తున్నారు.

రోజుల్లోనే రాజీవ్ విగ్రహం?

సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహా న్ని, సచివాలయం ముందు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయబోతు న్నట్టు ఫిబ్రవరిలో రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ ఆరు నెలల్లోనే యుద్ధ ప్రాతిపదికన రాజీవ్ విగ్రహాన్ని తయారు చేయించి ప్రతిష్ఠించి ప్రా రంభించారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మా త్రం డిసెంబర్ 9న ఏర్పాటు చేస్తామని చెప్పా రు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని రోజుల వ్యవధి లోనే తయారు చేయించి ప్రారంభించిన ప్పుడు తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటులో ఎందుకు ఆలస్యం అవుతుందని తెలంగాణ వాదులు ప్రశ్నిస్తున్నారు.

గాంధీలది వారసత్వం కాదా?

బీఆర్ఎస్‌ది కుటుంబ పార్టీ అని, గాంధీ లది మాత్రం స్వాతంత్ర్య పోరాట కుటుంబ మని రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. స్వాతంత్ర్య పోరాటంలో నెహ్రూ పాల్గొన్న విషయాన్ని కాదనలేమని, కానీ, తెలంగాణ కోసం కేసీఆర్ చేసిన ఉద్యమాన్ని, ఆయన చేసిన త్యాగాలను కించపరచడంపై తెలంగాణ వాదులు అభ్యం తరం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ కోసం చేసిన పోరాటం దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటం కన్నా తక్కువేమీ కాదని గుర్తుచేస్తున్నారు. గాంధీలది కుటుంబ రాజ కీయం కాదా? అని ప్రశ్నిస్తున్నారు.

అధికారిక సభలో తిట్ల దండకం

రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ సభ కార్య క్రమం అధికారిక కార్యక్రమం. ఈ విష యాన్ని మర్చిపోయిన సీఎం రేవంత్‌రెడ్డి దీన్ని రాజకీయ సభలాగా మార్చేశారనే విమ ర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారిక సభలో సీఎం మాదిరిగా మాట్లాడకుండా రాజకీయ సభలో రాజకీయ నేతలా తిట్ల దండకం ఎత్తుకోవడంపై విమర్శలు వినిపిస్తు న్నాయి. సీఎం స్థాయిలో ఉంటూ ప్రజలు ఏమనుకుంటారనే ఇంగితం లేకుండా సన్నాసి, బలుపు, దిక్కుమాలినోడు అని వ్యాఖ్యానించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మహనీయుల పేర్లు కేసీఆర్ పెట్టలేదా?

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత తెలంగాణ కోసం పోరాడిన, తెలంగాణ మహనీయులను గౌరవించే దిశగా నాటి సీఎం కేసీఆర్ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే వ్యవసాయ యూనివర్సిటీకి జయశంకర్ సార్ పేరు పెట్టగా, ఉద్యాన వర్సిటీకి కొండా లక్ష్మణ్‌బాపూజీ పేరు, వెటర్నరీ యూనివ ర్సిటీకి పీవీ నర్సింహారావు పేరు పెట్టి వారికి సముచిత గౌరవాన్ని ఇచ్చారు. వీటన్నింటినీ మర్చిపోయిన సీఎం రేవంత్‌రెడ్డి గత ప్రభుత్వం ఏం చేయలేదన్న ట్టుగా అబద్ధపు ప్రచారం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గాంధీ నామస్మరణలో రేవంత్!

- వైఎస్సార్‌ను ఫాలో అవుతున్న రేవంత్‌రెడ్డి
- వైఎస్‌లానే అన్ని పథకాలకు గాంధీల పేర్లు
- రాజీవ్ విగ్రహ ఏర్పాటు అందులో భాగమే
- అధిష్ఠానం వద్ద కోల్పోయిన విశ్వసనీయత
- ఒంటరిగా కలిసేందుకు కూడా విముఖత
- గాంధీల మెప్పుకోసం రేవంత్ అష్టకష్టాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 16(నమస్తే తెలం గాణ): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమం త్రిగా పనిచేసిన దివంగత రాజశేఖర్‌రెడ్డి పేరు చెప్పగానే వెంటనే గుర్తొచ్చేవి ఆయన ప్రవేశపె ట్టిన సంక్షేమ పథకాలే. ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. ఈ పథకాలన్నింటికీ గాంధీల పేర్లే ఉండేవి. తద్వారా అధిష్ఠానాన్ని మచ్చిక చేసు కునేవారు. ఫలితంగా రాష్ట్రంలో తనకు అడ్డు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. నాణేనికి ఇది రెండోవైపు. రాజశేఖర్‌రెడ్డి బలమైన నేత కావడం, ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నంత అస మ్మతి లేకపోవడంతో ఆయన పదవీకాలం సాఫీగా సాగిపోయింది. నిత్యం గాంధీల జపం చేయడం ద్వారా అటు పార్టీలోనూ, ఇటు ప్ర భుత్వంలోనూ తాను అనుకున్న పనులను నిర్విఘ్నంగా చేసుకుంటూ పోయేవారు. చూ స్తుంటే తెలంగాణ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కూడా వైఎస్ అడుగు జాడల్లోనే నడుస్తున్నట్టు గా అనిపిస్తున్నది. అవే ఎత్తుగడలను పాటిస్తూ పథకాలకు గాంధీ కుటుంబ పేర్లు పెట్టడం. బహిరంగ సభల్లో వీలు చిక్కినప్పుడల్లా గాంధీ లను ఆకాశానికి ఎత్తడం ద్వారా అధిష్ఠానం పెద్దలకు దగ్గర కావాలని, తద్వారా రాష్ట్రంలో తనకు ఎదురులేకుండా చూసుకోవాలని భావి స్తున్నారు. తాజాగా, సచివాలయం ఎదురుగా మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ విగ్ర హాన్ని ఏర్పాటు చేయడం కూడా అందులో భాగమేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. వైఎ స్‌కు ఎదురు నిలిచే నేతలు లేకపోవడం, ఆయ నే సీనియర్ కావడం కలిసొచ్చింది. కానీ, ప్రస్తుతం విరుద్ధమైన పరిస్థితులు నెలకొన్నా యి. రేవంత్ పరిస్థితి దినదినగండం నూరేండ్ల ఆయుష్షులా తయారైంది. రేవంత్ ఎప్పుడు దొరుకుతాడా? ఎప్పుడు సీటును తన్నుకుపో దామా? అని సీనియర్లు ఎదురుచూస్తున్నారు.

వైఎస్ జీవితాంతం కాంగ్రెస్‌తోనే..

వైఎస్ బాటనే రేవంత్ అనుసరిస్తున్నప్పటికీ ఇద్దరికీ ఏమాత్రం పోలికలేదు. వైఎస్సార్ జీవి తాంతం కాంగ్రెస్‌తోనే ఉన్నారు. పార్టీ కష్టకా లంలో ఉన్నప్పుడు పాదయాత్ర చేసి అధికా రంలోకి తీసుకొచ్చారు. కానీ, రేవంత్‌రెడ్డి పరి స్థితి వేరు. తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చి అనూహ్యంగా సీఎం పదవిని చేజిక్కించుకు న్నారు. సీనియర్లకు అధిష్ఠానం ఈ విషయం లో మొండిచేయి చూపింది. ఇది సీనియర్లకు కంటగింపుగా మారింది. మరోవైపు, రేవంత్ తీరుపై అధిష్ఠానం కూడా గుర్రుగా ఉంది. ప్రభుత్వ పరంగా ఆయన తీసుకుంటున్న నిర్ణ యాలు అధిష్ఠానానికి మింగుడుపడటం లేదు. ఆయన ఏ క్షణంలోనైనా పార్టీని ముంచి పోతా రన్న అనుమానం పార్టీ పెద్దలను వెంటాడుతు న్నది. అందుకే ప్రభుత్వ పరంగా ఎలాంటి నిర్ణ యం తీసుకున్నా తమకు చెప్పేచేయాలని అధి ష్ఠానం షరతు విధించినట్టు తెలిసింది. దీనికి తోడు రేవంత్‌రెడ్డితో నేరుగా భేటీ అయేందుకు పార్టీ పెద్దలు ఉత్సాహం చూపడం లేదు. ఆయ నతోపాటు మరెవరైనా ఉంటేనే భేటీకి గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. గాంధీలకు తనపై విశ్వాసం లేదన్న విషయం తెలిసే రేవంత్ ఇలా గాంధీల నామస్మరణ చేస్తూ దగ్గర కావాలన్న ప్రయత్నా లు చేస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

19న టీవీవీపీ కమిషనర్ కార్యాలయ ముట్టడి

కాంట్రాక్ట్ కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు పెండింగ్

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): టీవీవీపీ దవాఖానల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఆరు నెల లుగా వేతనాలు చెల్లించనందుకు నిరస నగా 19న టీవీవీపీ కమిషనర్ కార్యాల యాన్ని ముట్టడించనున్నారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, ప్రధాన కార్యదర్శి నరసింహ సోమవారం ప్రక టన విడుదల చేశారు. శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు అందక పస్తులు ఉంటున్నారని పేర్కొన్నారు. వేతనాలు చెల్లించాలని 10వ తేదీ నుంచి ఏరియా దవాఖానలు, సీహెచ్‌సీల్లో రోజూ గంట పాటు ధర్నా చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని వాపోయారు. దీంతో 19న కమిషనర్ కార్యాలయ ముట్టడికి సిద్ధమైనట్టు వెల్లడించారు.

కాంగ్రెస్‌లో కౌంటర్ చెక్ పాలిటిక్స్

- రేవంత్‌రెడ్డి సిఫార్సులపై అధిష్ఠానం మెలిక
- ఉత్తమ్ లేదా భట్టితో సెకండ్ ఒపీనియన్
- మంత్రివర్గ విస్తరణ జాప్యానికి ఇదే కారణమా?
- పీసీసీ పీఠంపై తొలుత తాత్సారం.. తర్వాత గ్రీన్‌సిగ్నల్
- నామినేటెడ్ పోస్టుల భర్తీలోనూ ఇదే పరిస్థితి

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్16(నమస్తే తెలంగాణ): రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల్లో 'ఉత్త(మ్)మ' నిర్ణయాల పేరుతో కౌంటర్ చెక్ పాలిటిక్స్‌ను అధిష్ఠానం అమలుచేస్తు న్నదా? కొంతకాలంగా కాంగ్రెస్‌లో వరుసగా చోటుచేసుకుంటున్న పరిణామాలు ఇటు వంటి అభిప్రాయమే కలిగిస్తున్నాయి. ముఖ్య మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ప్రభుత్వంతోపాటు పార్టీపై కూడా పూర్తి స్థాయిలో పట్టు బిగించేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తూనే ఉన్నారు. అందుకోసం పలు ప్రతిపాదనలు, సిఫార్సులతో అధిష్ఠానం వద్దకు వెళ్తున్న రేవంత్‌రెడ్డికి వెంటనే గ్రీన్‌సి గ్నల్ లభిస్తున్నట్టు లేదు. రేవంత్‌రెడ్డి తమ ముందు పెడుతున్న అంశాలపై అధిష్ఠానం సెకండ్ ఓపీనియన్ తీసుకోవడం ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో ఆదినుంచీ సోనియాగాంధీ కుటుం బానికి, కాంగ్రెస్ పార్టీకి లాయల్‌గా ఉండే ఒక రిద్దరి నేతలతో రేవంత్ సిఫార్సులపై చర్చిం చాకే ముందుకు వెళ్తున్నట్టు సమాచారం. అందువల్లే పీసీసీ అధ్యక్షుడి ఎంపిక, మంత్రి వర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ వంటి అంశాలన్నీ నిదానంగా సాగుతున్నట్టు తెలు స్తున్నది. మంత్రివర్గ విస్తరణనే పరిశీలిస్తే.. ఇప్పటికే పలుమార్లు కొలిక్కి వచ్చినట్టే వచ్చి ఆగిపోతున్నది. ఇందులో రేవంత్ సిఫార్సు లకు ఉత్తమ్‌కుమార్ చెక్ పెడుతున్నట్టు చర్చ జరుగుతున్నది. కొత్తగా మంత్రి వర్గంలోకి నిజామాబాద్ జిల్లాకు చెందిన సుదర్శన్‌రెడ్డి పేరును సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదిస్తున్నారు. సుదర్శన్‌రెడ్డితోపాటు తనపై అన్నివైపుల నుంచి తీవ్ర ఒత్తిడి తెస్తున్న కోమటిరెడ్డి రాజ గోపాల్‌రెడ్డి వైపు రేవంత్‌రెడ్డి మొగ్గు చూపుతు న్నట్టు సమాచారం. అయితే, దీనిపై అధి ష్ఠానం ఉత్తమ్ అభిప్రాయం కోరగా.. 'ఒకే ఇంట్లో రెండో మంత్రి పదవి రాజగోపాల్‌రె డ్డికి ఇవ్వాలనుకుంటే తన సతీమణి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతికికి కూడా ఎందుకు ఇవ్వ కూడదు?' అని మెలిక పెట్టారని తెలిసింది. ఈ పరిణామాలు మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న రాజగోపాల్‌రెడ్డికి మింగుడు పడ లేదు. అందుకే ఉత్తమ్‌ను కూల్ చేసేందుకు ఇటీవల భువనగిరిలో నిర్వహించిన సాగు నీటి పనుల సమీక్షలో 'సీఎం కావాల్సిన వ్యక్తి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి' అని సంబోధించక తప్ప లేదన్న చర్చ జరిగింది. రేవంత్‌రెడ్డి కూడా ఒక మెట్టు దిగి ఉత్తమ్‌ను సంతృప్తిపరిచేందుకు ఆయన సతీమణి పద్మావతిరెడ్డికి అంచనాల కమిటీ చైర్మన్ పోస్టును కట్టబెట్టారన్న చర్చ జరుగుతున్నది. అంచనాల కమిటీ చైర్మన్ పద విని పద్మావతితోపాటు ఉత్తమ్ కూడా ఊహించలేదని సమాచారం. మంత్రివర్గ విస్త రణ ఎప్పుడు జరిగినా తన అభిప్రాయం తప్పనిసరి అన్న ధీమాలో ఉత్తమ్ ఉన్నట్టు తెలుస్తున్నది. ఎట్టకేలకు అధిష్ఠానం పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఎంపిక చేసినా, రేవంత్‌రెడ్డి పంతం అంత ఈజీగా నెగ్గలేదన్నది నిజం. ఇక్కడ కూడా మహేశ్‌కు మార్‌గౌడ్‌కు పోటీగా బలరాంనాయక్, మధు యాష్కీగౌడ్ రేసులో నిలిచారు. రేవంత్ అవు ట్‌రైట్‌గా మహేశ్‌కుమార్‌గౌడ్ వైపు మొగ్గు చూపగా, ఉత్తమ్ అందుకు భిన్నంగా తటస్థ వైఖరి అనుసరించడంతో ఆలస్యమైనట్టు సమాచారం.

నామినేటెడ్ పోస్టుల్లో సైతం

కాంగ్రెస్‌లో నామినేటెడ్ పోస్టుల భర్తీ లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నట్టు తెలిసింది. ఆదినుంచీ పార్టీని నమ్ముకుని, కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకుని ఉన్న నేతలకే నామినే టెడ్ పోస్టులు ఇవ్వాలన్నది ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వాదన. అయితే, సీఎం రేవంత్ మాత్రం తన తోపాటు కాంగ్రెస్‌లోకి వచ్చిన నేతలకు, ప్రస్తుతం తన వర్గంగా కొనసాగుతున్న వారికే పెద్దపీట వేస్తున్నారన్న చర్చ జరుగుతుంది. అందుకు గత నెలలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితోపాటు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు గుత్తా అమిత్‌రెడ్డికి నామినేటెడ్ పోస్టుల కేటాయింపులను ఉదహ రిస్తున్నారు. వీరు ఎన్నికల అనంతరం వారి అవసరాల కోసం పార్టీలోకి వచ్చారని, అలాంటి వారికి వెంటనే పోస్టులు ఇస్తే పార్టీ శ్రేణుల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని ఉత్తమ్ అడ్డుపడినట్టు సమాచారం. పోస్టుల ప్రకటన అనంతరం పార్టీ అధిష్ఠానం మరో వి షయంలో తనను ఢిల్లీకి పిలిస్తే ఉత్తమ్ తన నిర్ణయాన్ని కుండబద్దలు కొట్టినట్టు తెలిసింది. 'ఇది మంచి సంప్రదాయం కాదు.. వెంటనే వారి పోస్టులను హోల్డ్‌లో పెట్టాలి' అని అధి ష్ఠానానికి సూచించినట్టు ఆ పార్టీ వర్గాల్లో చర్చ జరిగింది. ఉత్తమ్ దెబ్బతో పోచారంతోపాటు అమిత్‌రెడ్డి కొన్నాళ్లు పదవీ బాధ్యతలు చేపట్ట కుండానే వేచి చూడాల్సి వచ్చింది. ఈ పరిణా మాలను అవమానంగా భావించిన రేవంత్ రెడ్డి వర్గం... వారం రోజుల కిందట వీరిద్దరినీ గుట్టుచప్పుడు కాకుండా బాధ్యతలు చేపట్టా లని పురమాయించినట్టు తెలిసింది. దాంతో వీరిద్దరూ ఎలాంటి హంగూ, ఆర్భాటం, ప్రచారం లేకుండా బాధ్యతలు స్వీకరించారు. ఈ పరిణామాలన్నీ ఇప్పుడు ఆ పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

ధీమాగా ఉత్తమ్!

రాష్ట్ర ప్రభుత్వ పాలన లేదా పార్టీ పరమైన కార్యక్రమాల్లో సీఎం రేవంత్‌రె డ్డితోపాటు ఆయన వర్గం తనను సంప్ర దించకపోయినా... తన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకపోయినా పెద్దగా వచ్చిన నష్టమేమీ లేదన్న ధోరణితో ఉత్తమ్ ఉన్నట్టు సమాచారం. కీలక నిర్ణ యాల్లో అధిష్ఠానం తనను తప్పకుండా సంప్రదిస్తుందన్న ధీమాలో ఉత్తమ్ ఉన్నారు. రేవంత్‌రెడ్డి నేరుగా రాహుల్ గాంధీతో టచ్‌లో ఉండే ప్రయత్నాలు చేస్తుంటే, ఉత్తమ్‌కుమార్ మాత్రం ఏఐ సీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌తో టచ్‌లో ఉన్నట్టు సమాచారం. దీంతో అధిష్ఠానం వద్ద రేవంత్‌రెడ్డి ఏ ప్రతిపాదనలు పెట్టినా వెంటనే అవి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి చేరుతు న్నాయని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. దాంతోపాటు రాష్ట్రంలో రేవంత్‌రెడ్డితో అంటీముట్టనట్టుగా ఉండాలనే ధోరణినే ఉత్తమ్ అనుసరిస్తున్నట్టు సమాచారం. 'రేవంత్‌రెడ్డి పిలిస్తే పోతా... పిలువకపోతే ఎందులోనూ ఇన్వాల్వ్ కాను. నా పని నేను చేసుకుంటా. నా లెక్క నాకుం టుంది కదా' అనే ధోరణిని ఉత్తమ్‌కుమా ర్‌రెడ్డి వ్యక్తపరుస్తున్నారు.

ఢిల్లీకి గులాంగిరి!

- కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాలకు నిర్ణయాధికారం 'జీరో'

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్16(న మస్తే తెలంగాణ): 'ఏ రాష్ట్రంలోనైతే కాంగ్రెస్ అధికారంలో ఉంటుందో.. ఆ రాష్ట్రం ఢిల్లీకి గులాంగిరి చెయ్యాల్సిం దే'.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో బాగా వైరల్‌గా మారిన కామెంట్ ఇది. కర్ణాటకలో జరుగుతున్న పరిణామాలు ఈ వాద నకు బలాన్నిస్తున్నాయి. రాష్ట్రంలోని ప్రైవేటు సంస్థల్లో నాన్ మేనేజ్‌మెంట్ పోస్టుల్లో 70 శాతం, మేనేజ్‌మెంట్ పోస్టుల్లో 50 శాతం ఉద్యోగాలను కన్న డిగులకే కేటాయించాలంటూ కర్ణాటక లోని సిద్దరామయ్య ప్రభుత్వం తీసు కొన్న ఇటీవలి నిర్ణయంపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. విమర్శ లు వెల్లువెత్తడంతో రాహుల్ ఆదేశాల తో సిద్దరామయ్య సర్కారు బిల్లును వెనక్కి తీసుకొన్నదని జాతీయ మీడి యా పలు కథనాల్లో వెల్లడించింది. అంటే, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏ నిర్ణయాన్ని తీసుకోవాలన్నా దానికి ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దల అనుమతి తప్పనిసరి అన్న విషయం కర్ణాటక ఘ టనతో రుజువవుతున్నది.

తెలంగాణ ఆగమాగం

తెలంగాణ బిడ్డల మేలు కోరి రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో 95 శాతం కొలువు లు స్థానికులకే ఇవ్వాలంటూ అప్పటి కేసీఆర్ సర్కారు ఆదేశాలు జారీ చేసిం ది. వివాదాలు తలెత్తకుండా ఈ వ్యవ హారాన్ని చక్కబెట్టింది. పాలనా వికేంద్రీ కరణలో భాగంగా 33 జిల్లాలను ఏర్పా టు చేసింది. తర్వాత వచ్చిన రేవంత్ ప్రభుత్వం 19 జిల్లాలను రద్దు చేస్తా మంటూ ప్రకటనలు గుప్పిస్తున్నది. ఇదే జరిగితే జోనల్ వ్యవస్థను మళ్లీ మార్చాల్సి వస్తుంది. కొత్త వ్యవ స్థ వచ్చే వరకూ నోటిఫికేషన్లు, నియామ కాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఉం డబోవు. ఇది ఒకవిధంగా తెలంగాణ ప్రజలకు నష్టాన్ని కలిగించేదే. ఇక, జిల్లాల రద్దుపై అంతిమ నిర్ణయాధికా రం రేవంత్ చేతిలో ఉంటుందా? అం టే, అదీలేదు. ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దల నుంచి అనుమతి తీసుకోవాల్సిందే. అంటే ఒకవిధంగా రాష్ట్రానికి సంబం ధించిన నిర్ణయాలూ ఢిల్లీ కేంద్రంగా నడవాల్సిందేనన్న మాట. 'తెలంగాణ స్థితిగతులపై ఏమాత్రం అవగాహనలేని ఢిల్లీ పెద్దలకు రాష్ట్రానికి సంబంధించిన కీలక విషయాల్లో నిర్ణయాధికారం ఇవ్వ డమంటే ఇది ఒకరకమైన పరాయిపాల నే'నని అవుతుందని తెలంగాణవా దులు అభిప్రాయపడుతున్నారు.

మంత్రుల కుతకుత

మొదటిపేజీ తరువాయి...

వెలువడ్డాయి. ఈ ఘటనతో మంత్రులకు తొలి షాక్ తగిలినట్టు తెలిసింది. ఆ తరువాత రుణమాఫీ, కరెంట్ కోతలు, ఆరు గ్యారెంటీల అమలు, ఉద్యోగాల భర్తీతోపాటు ఇటీవలి హై డ్రా నిర్ణయం వరకు మంత్రులకు వరుస షాక్ లు తగులుతూనే ఉన్నాయని అంటున్నారు.

మంత్రులకు తెలియకుండానే నిర్ణయాలు..

ప్రభుత్వంలో పలు కీలక నిర్ణయాలు మంత్రులకు తెలియకుండానే జరిపోతున్నట్టు సమాచారం. ముఖ్యంగా హైడ్రా ఏర్పాటు వంటి కీలక నిర్ణయం మంత్రులెవరికీ తెలియ దని అంటున్నారు. చాలా నిర్ణయాలు అమ ల్లోకి వచ్చిన తర్వాత లేదా పేపర్లు, టీవీల్లో చూసి తమ తెలుసుకోవాల్సిన దౌర్భాగ్యం తమకు పట్టిందని ఓ కీలక మంత్రి తన సన్ని హితుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలి సింది. రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు, తెలంగాణ తల్లి విగ్రహానికి భూమి పూజ, రుణ మాఫీ కార్యక్రమాల నిర్వహణ వంటివి తమకు తెలియకుండానే నిర్ణయాలు జరిగిపో యినట్టు మంత్రులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నట్టు తెలిసింది.

మంత్రులను ముందుకు తోసి..

ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తమవు తుందనుకునే అంశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి అతి తెలివిగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయాలు పార్టీలో వినిపిస్తున్నాయి. ఇలాంటి విషయా లపై ముందుగా మంత్రులను ముందుకు ఎగ దోసి వారితో మాట్లాడిస్తున్నారని తెలిసింది. మంత్రులు చెప్పే మాటలపై ప్రజల్లో స్పంద నను బట్టి ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని చెప్తున్నారు. రుణమాఫీ, ఎమ్మెల్యేల ఫిరాయింపులు, కౌశిక్‌రెడ్డి, గాంధీల వివాదంపై తొలుత మంత్రులను ముందుకు తోసినట్టు తెలిసింది. మంత్రులకు ఇష్టం లేకపోయినా వారితో మీడియా సమా వేశాలు పెట్టించి ఏదో ఒకటి మాట్లాడిస్తున్నా రని చెప్తున్నారు. తీరా మంత్రులు మాట్లాడిన తర్వాత వారికి పూర్తి విరుద్ధంగా సీఎం రేవం త్‌రెడ్డి మాట్లాడుతున్నారనే చర్చ జరుగుతు న్నది. దీంతో మంత్రులు సీఎం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం.

ఉత్తర్వులు వచ్చేదాక చెప్పరా?

తెలంగాణ బిడ్డలను కాదని ఆంధ్రా ప్రాంతం వారికి పదవులు కట్టబెడుతూ ఉత్త ర్వులు వచ్చేదాకా తమకు తెలియటం లేదని మంత్రులు రగిలిపోతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తూ రాష్ట్రాన్ని ఆంధ్రప్రదేశ్ పునరావాస కేంద్రంగా మారు స్తున్నారని భగ్గుమంటున్నారు. రేవంత్‌రెడ్డి సమైక్యపాలకులను తలదన్నేలా తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారని పార్టీలో సీనియర్ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. పార్టీ పదవులు, ప్రభుత్వ పదవులు అన్నీ తన ఇష్టానుసారం, తన ఇష్టమైనవారికే కట్టబెడుతూ సీఎం తమ ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నారని మంత్రులు మండిపడుతున్నా రని సమాచారం. ఏపీకి చెందిన నిమ్మగడ్డ రమేశ్‌కుమార్, ఆదిత్యనాథ్‌దాస్, అనిలా వావిళ్ల, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రాజు, శ్రీరాం కర్రీ, ఆంజనేయరెడ్డి వంటివారిని నియమించే సమయంలో కనీసం తమకు మాట మాత్రమైనా చెప్పలేదని సంబంధిత శాఖల మంత్రులు కుతకుతలాడిపోతున్నా రని చర్చించుకుంటున్నారు.

చులకనవుతున్నాం

సీఎం తీరు వల్ల తాము ప్రజల్లో చులకనవుతున్నామని మంత్రులు ఆవే దన వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. తమతో ఒక విధంగా మాట్లాడించి, ఆయన మాత్రం ఇంకో విధంగా మాట్లాడుతూ.. తమను పిచ్చోళ్లను చేస్తున్నారని వాపోతున్నారట. ఇందుకు రుణమాఫీ, అరికెపూడి గాంధీ వివా దాన్ని ఉదాహరణగా చూపుతున్నారు. రుణమాఫీ పూర్తి కాలేదని తాము చెప్తుంటే.. సీఎం మాత్రం పూర్తయిపో యిందని చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుల దృష్టిలో తాము విలన్లుగా మారిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరికెపూడి గాంధీ బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే అని మంత్రులు శ్రీధర్‌బాబు, భట్టి విక్ర మార్క చెప్పగా.. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఆయన తమ పార్టీకి చెందిన వారేనని చెప్పుకొచ్చారు. పైగా కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేసింది తమ వాళ్లే నంటూ కుండబద్దలు కొట్టారు.

నాడు విలీనం.. నేడు ప్రజాపాలన!

- సెప్టెంబర్ 17పై ముఖ్యమంత్రి రేవంత్ రెండు నాల్కల ధోరణి
- విలీన దినోత్సవం నిర్వహించాలని గతంలో డిమాండ్
- అధికారంలోకి వచ్చాక 'ప్రజాపాలన దినోత్సవం'గా మార్పు



హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలం గాణ): 'నిజాం సంస్థానాన్ని దేశంలో కలిపిన రోజును విలీన దినోత్సవంగా కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా విలీన దినోత్సవంగానే నిర్వహించాలి..' టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి 2022 సెప్టెంబర్‌లో చేసిన వ్యాఖ్యలివి. విలీనం జరిగి 75 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా కాంగ్రె స్ తరఫున 2022 సెప్టెంబర్ 17 నుంచి ఏడా దిపాటు 'విలీన వజ్రోత్సవాలు' పేరుతో కార్య క్రమాలు నిర్వహిస్తామని ప్రకటించిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు అధికారం చేపట్టాక మాట మా ర్చారు. 'ప్రజాపాలన దినోత్సవం' పేరుతో అధికారిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 'ప్రజాపాలన' అనేది అసెంబ్లీ ఎన్నికల ముందు నుంచి కాంగ్రెస్ నినాదంగా కొనసా గుతున్న విషయం అందరికీ తెలిసిందే. 'ప్రజా పాలన' పేరుతో ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నది. ఇప్పుడు ఆ పేరునే సెప్టెంబర్ 17 వేడుకలకు వినియోగిస్తుండటంపై తెలంగాణ వాదులు మండిపడుతున్నారు. గతంలో కేసీ ఆర్ ప్రభుత్వం 'జాతీయ సమైక్యత దినో త్సవం' పేరుతో వేడుకలు నిర్వహించినప్పుడు తప్పుబట్టిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు 'విలీన దినోత్సవం' పేరుతో వేడుకలను ఎందుకు నిర్వహించడం లేదని నిలదీస్తున్నారు. గతంలో టీపీసీసీ అధ్యక్షుడిగా 'విలీన దినో త్సవం' పేరు తో గాంధీభవన్‌లో జెండా ఎగు రవేసిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పుడెందుకు మాట్లాడటం లేదని అడుగుతున్నారు. కాంగ్రె స్ మాత్రం విలీన దినోత్సవం పేరుతోనే కార్య క్రమం నిర్వహిస్తుందని చెప్పిన ఆ పార్టీ నేత అద్దం కి దయాకర్.. ఇప్పుడెందుకు 'ప్రజాపా లన'కు ఓటేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

మాట మార్చిన సీపీఐ

సెప్టెంబర్ 17ను విలీన దినోత్సవంగా నిర్వహించాలని గతంలో సీపీఐ డిమాండ్ చేసింది. విలీన దినోత్సవం నిర్వ హించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు నిరుడు ఆగస్టులో సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. నిరుడు సెప్టెంబర్‌లో హై దరాబా ద్‌లో నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాల్లో పార్టీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మా ట్లాడుతూ.. జాతీయ సమైక్యత దినోత్సవంగా నిర్వహించడమంటే తెలంగాణ సాయుధ పో రాటాన్ని నీరుగార్చడమేనని, కనుక సెప్టెంబర్ 17ను 'విలీన దినోత్సవం'గానే నిర్వహించా లని డిమాండ్ చేశారు. కానీ, ఇప్పుడు సీపీఐ నేతలంతా ఆ మాటలను మర్చిపోవడంపై తెలంగాణవాదులు మండిపడుతున్నారు.